క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



ఖానాపురం : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మండలంలోని కొత్తూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే అమెరికా, కెనడా పర్యటన ముగించుకొని స్వదేశానికి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు అజ్మీర రాజునాయక్, జంగిలి రాజ్‌కుమార్, మహంకాళి నరేశ్, నీరటి సుధాకర్, పిండి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన వేమిశెట్టి సుమ–నవీన్ దంపతులు గురువారం రూ.5,116 విరాళం అందజేశారు. దాతను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ నిర్మాణానికి భక్తులు తోడ్పాటు అందించాలని కోరారు.

గ్రామాల్లో ఈజీఎస్ సభలు



చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట, లింగాపురం, జల్లి, ఉప్పరపల్లి, బోజేర్వు గ్రామాల్లో 15వ విడత ఈజీఎస్ సామాజిక తనిఖీ బృందం గురువారం సభలు నిర్వహించింది. గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులతో చర్చించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తెలిపారు. సభల్లో ఏపీఓ అరుణ, ఈసీ కిశోర్, టీఏలు మనోహర్, సత్యనారాయణ సింగ్, తనిఖీ సీఆర్‌పీ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు శ్వేత, మహేశ్, షకీల్, అశోక్, స్వరాజ్యం, ఎఫ్‌ఏలు రమేశ్, సురేశ్, రమేశ్, తిరుపతి, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం



రాయపర్తి (వర్ధన్నపేట) : కల్కి సినిమా విడుదల కావడంతో హీరో ప్రభాస్ చిత్రపటానికి వర్ధన్నపేట పట్టణంలోని ఎస్‌వీఎస్ థియేటర్‌లో అభిమానులు గురువారం పాలాభిషేకం చేశారు. డై హార్డ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రభాస్ అభిమానులు ఆజ్జు, దండు సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్‌లో పరిశీలన



నల్లబెల్లి : మండల కేంద్రంలోని ఆదర్శవాణి ప్రైవేట్ పాఠశాలను ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్, డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు గురువారం సందర్శించి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు అధిక రేట్లకు అమ్ముతున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

చెత్తాచెదారం తొలగింపు

ఖిలా వరంగల్ : వరంగల్ నాయుడు పంపు సమీపంలోని శ్రీవెంకటేశ్వర కాలనీలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య సిబ్బంది గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్, శ్రీనివాస్ గుప్తా నేతృత్వంలో గ్రీవెన్ సెల్‌లో ఫిర్యాదు చేయగా అధికారులు గురువారం స్పందించారు. కార్మికులు డ్రైనేజీల్లో పేరుకపోయిన చెత్తాచెదారం తొలగించి రహదారులను శుభ్రం చేశారు. సుభాష్ రావు, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టెండర్ల ఖరారు

వరంగల్ : ఏనుమాముల వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని యార్డు (పసువు, పల్లికాయ, పత్తి, మిర్చి, ధాన్యం, అపరాల యార్డు), లక్ష్మీపురంలోని పాత, నూతన మోడల్ కూరగాయల మార్కెట్‌లలో 11నెలల పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు నిర్వహించిన టెండర్లను ఖరారు చేసినట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి జి.రెడ్డి తెలిపారు. యార్డుల క్లీనింగ్‌తో పాటు షాప్ షాపు, క్యాంటీన్, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించిన టెండర్లను పిలవగా మొత్తం 15మంది దరఖాస్తులు చేసినట్లు తెలిపారు.

కానరాని హరితహారం మొక్కలు

ఏపుగా పెరిగిన ముళ్లపొదలు
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- అధికారుల నిర్లక్ష్యం



సంగెం-తిమ్మాపూర్ మధ్య రోడ్డుపైకి చొచ్చుకుని వచ్చిన ముళ్లపొదలు

సంగెం : అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. మండల కేంద్రం నుంచి తీగరాజుపల్లి వరకున్న ఆర్ అండ్ బీ రోడ్డు వెంట హరితహారం మొక్కలకు మించి ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయి. హరితహారంలో భాగంగా మొక్కలు నాటినపుడు అన్ని శాఖల అధికారులు శ్రద్ధ చూపినా అనంతరం వాటి సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డుకు ఇరువైపుల గతంలో నాటిన మొక్కలు కాకుండా 2021లో అటవీ శాఖ ఆధ్వర్యంలో మల్టీలేయర్ ప్లాంటేషన్ పథకంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా రెండు వరుసల మొక్కలను నాటిన విషయం తెలిసిందే. కొన్ని చోట్ల ఏపుగా పెరిగిన హరితహారం మొక్కలను విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయంటూ ఆ శాఖ అధికారులు తొలగించారు. అసలే మూలమలుపులు, ఆపై ముళ్లపొదలు ఉండడంతో ప్రయాణికులకు ప్రమాదాలు తప్పడం లేదు. ముళ్లపొదలు ఏపుగా పెరిగి బీటీ రోడ్డుపైకి చొచ్చుకుని రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక పలు చోట్ల ప్రమాదాలు జరిగాయి. అయినా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపైకి చొచ్చుకుని వచ్చిన ముళ్లపొదలను తొలగించి రోడ్డు ప్రమాదాలను నివారించడంతోపాటు హరితహారం మొక్కలను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్యాంగ్‌మెన్లు లేరు.. నిధులు లేవు

రోడ్డు మెయింటెనెన్స్ కోసం గ్యాంగ్‌మెన్లు లేరు. అలాగే రోడ్డు మెయింటనెన్స్, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టడానికి నిధులు కూడా లేవు. ముళ్లపొదలు రోడ్డు మీదకు చొచ్చుకుని వచ్చిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జంగిల్ క్లియరెన్స్ చేయిస్తాం.

-సుమలత, ఏఈ, ఆర్ అండ్ బీ

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- పలు శాఖల అధికారులు గైర్హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి

సంగెం : మండల చివరి సర్వసభ్య సమావేశం గురువారం మొక్కుబడిగా సాగింది. స్థానిక రైతు వేదికలో సమావేశం నిర్వహించగా ఎంపీపీ అధ్యక్షత వహించారు. ఎంపీటీసీలు మాత్రమే ప్రజాప్రతినిధులుగా ఉండడంతోపాటు పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో సభ ఖాళీగా కనిపించింది. అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో సమస్యలపై నిలదీసే దిక్కు లేకుండా పోయిన పరిస్థితి కనపడింది. ఎంపీటీసీల పదవి కాలం మరో వారం రోజుల్లో ముగియనుండగా వారూ పెద్దగా స్పందించిన దాఖలాల్లేవు. సంగెం చెరువు తూముల మరమ్మతులకు గురయ్యాయని, గవిచర్ల చెరువు కట్ట నుంచి నీరు లీకవుతోందని, తిమ్మాపూర్ చెరువు పంట కాల్వ కొట్టుకుపోయిందని సంగెం, గవిచర్ల ఎంపీటీసీలు మల్లయ్య, సంపత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుమారస్వామి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఐబీ ఏఈ హమీద్‌ను నిలదీశారు. ఐసీడీఎస్ వారి పనితీరుపై మహిళా ఎంపీటీసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. సంగెం శాఖ గ్రంథాలయానికి భవనం కేయించాలని లైబ్రేరియన్ కోరారు. సంగెం ఎస్సీ, బీసీ, ఎస్టీ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటున్న క్రమంలో హాస్టల్‌ను గవిచర్లకు యిస్తే బాగుంటుందని ప్రజాప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు. బీసీ బాయ్స్ హాస్టల్‌ను ప్రభుత్వ అనుమతితో బాలికలకు కేటాయించాలని తీర్మానించారు. మండల కేంద్రంలో సామూహిక మరుగుదొడ్డి, కుంటపల్లి, వెంకటాపూర్ గ్రామాలకు ప్రజాగ్రంథాలయాలు మంజూరయ్యాయని త్వరలో వాటికి గదులు కేటాయిస్తామని ఎంపీపీ చెప్పారు. ఐదేళ్లు సమన్వయంతో పని చేశారంటూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ కాసర్ల రవీందర్, సీనియర్ అసిస్టెంట్ ఓంప్రకాశ్, ఏఓ యాకయ్య, పీఆర్ ఏఈ రమేశ్ కుమార్, పశు వైద్యాధికారి రాజు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణతో మహిళల ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నర్సింహమూర్తి

నల్లబెల్లి : ప్రభుత్వం తలపెట్టిన కుట్టుశిక్షణతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఎంపీడీఓ నర్సింహమూర్తి తెలిపారు. ఆర్‌సెట్ ఆధ్వర్యంలో స్థానిక మదర్ తెరిస్సా మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కేంద్రాన్ని డీపీఎం సుజాతతో కలిసి ఎంపీడీఓ నర్సింహమూర్తి గురువారం ప్రారంభించి మాట్లాడారు. మహిళల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం ఉన్నతి కార్యక్రమంలో భాగంగా కుట్టు శిక్షణకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో100 రోజుల పని దినాలు పూర్తి చేసిన కుటుంబాల్లోని ఆసక్తి కలిగిన మహిళలకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సునీత, ఏపీఓ వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు వెలగక చీకట్లు



చెన్నారావుపేట : మండలంలోని జల్లి తండాలో విద్యుత్ దీపాలు వెలగక పలు వీధులు చీకట్లో మగ్గిపోతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదంటూ తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 రోజులుగా వీధుల్లో రాత్రి వేళల్లో చీకటి రాజ్యమేలుతుండగా సమస్యను పంచాయతీ కార్యదర్శికి తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. వర్షాలు కురుస్తున్న క్రమంలో రాత్రిళ్లు ఇంట్లోంచి బయటకు రావాలంటే భయంగా ఉంటోందని పలువురు చెప్పారు. వానలకు పాములు, తేళ్లు తిరుగుతున్నాయని, చీకట్లో విషకీటకాల బారిన పడినా గుర్తించే పరిస్థితి లేదని తండావాసులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలకు దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

- 36 లీటర్ల గుడుంబా, 2 ద్విచక్రవాహనాలు స్వాధీనం



గుడుంబాను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నెక్కొండ : మండలంలోని చెరువు ముందు తండా, కునుసోతు తండాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, సివిల్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడుంబా స్థావరాన్ని, 1200 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేయడంతోపాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎక్సైజ్ శాఖ నర్సంపేట సీఐ నరేశ్‌రెడ్డి మాట్లాడారు. గుడుంబా తయారీకి పాల్పడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐలు రమేశ్ చందర్, నాగయ్య, ఆ శాఖ నర్సంపేట ఎస్సై శిరీష, నెక్కొండ సివిల్ ఎస్సై మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



చెన్నారావుపేట : నగదు అందజేస్తున్న బాధ్యులు



దుగ్గొండి : మల్రెడ్డిపల్లిలో.

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామానికి చెందిన రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో బాధ్యులు రూ.5 వేల సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చీకటి రాజశేఖర్, సభ్యులు పులి రమేశ్, కొంకాల గౌతమ్, రమేశ్, నరేశ్, అజిత్, అనిల్, నందు, గంధం రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మల్రెడ్డిపల్లిలో..

దుగ్గొండి : మండలంలోని మల్రెడ్డిపల్లికి చెందిన రాదారపు సారమ్మ ఇటీవల మృతి చెందగా అతడి కుమారుడు రాజుకు గ్రామానికి చెందిన డ్యాగం సుజాత–సుధాకర్, ఎన్‌ఆర్ఐ యశ్వంత్ రూ.5 వేల నగదుతోపాటు 25 కేజీల బియ్యాన్ని సాయంగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుక్కముడి సదయ్య, రాదారపు వనయ్య, మైదం అయిలయ్య, మాస మొగిలి, పులి స్వామి, కొత్తపల్లి రమేశ్, రాదారపు అశోక్, కృష్ణబాబు, లింగయ్య, మహిపాల్, ఒలిగే శివాజీ, అంబీరు రాజేశ్, రాదారపు సాయికుమార్, దేవరాజు, గైకోటి నాగరాజు, సంతోశ్, రాజు, డ్యాగం శివాజీ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి.. అంత్యక్రియలకు చేయూత



ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటకు చెందిన బొమ్మగాని వీరలక్ష్మి (106) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందారు. ఈ సందర్భంగా కడు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న బాధిత కుటుంబానికి అంత్యక్రియల నిర్వహణ కోసం గ్రామస్తులు, యువజన సంఘాల బాధ్యులు విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో దాతల నుంచి రూ.20 వేలు నగదుతోపాటు 25 కేజీల బియ్యం సేకరించి అందజేశారు. శవయాత్రకు ఉచితంగా సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు కూస కుమారస్వామి, కత్తాల వెంకటేశ్వర్‌రావు, మాద్రాజు వెంకన్న, కరుణాకర్, సమ్మయ్య, గుట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యాబోధనే లక్ష్యం



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ నర్సింహమూర్తి

నల్లబెల్లి : అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఆటపాటలతో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పూర్వ ప్రాథమిక విద్యాబోధనను అమలు చేస్తోందని ఎంపీడీఓ నర్సింహమూర్తి తెలిపారు. నూతన సిలబస్‌లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అంగన్‌వాడీ టీచర్లకు మూడ్రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను ఐసీడీఎస్ ఏసీడీపీఓ శ్రీదేవితో కలిసి ఎంపీడీఓ ప్రారంభించి మాట్లాడారు. శిక్షణను అంగన్‌వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్వ ప్రాథమిక విద్యాబోధన అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఝాన్సీరాణి, రమ, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ



పరామర్శిస్తున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : మండలంలోని పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. తొలుత ఇటీవల మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన వీర్ల వైష్ణవి, నలేంద్ర రామ్మూర్తి కుటుంబాలను పరామర్శించారు. అనంతరం అర్వయ్యపల్లిలో మాజీ జెడ్పీటీసీ హరినాథ్ సింగ్ శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి, మాజీ సర్పంచ్ రాజారాం, నల్లబెల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ నాయకుడికి..



పరామర్శిస్తున్న శ్రీనివాస్‌నాయక్

పర్వతగిరి : ఎస్సీ సెల్ నాయకుడు జిల్లా కనకయ్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ గురువారం పరామర్శించారు. కనకయ్య ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో చర్చించారు. త్వరలో కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోతు భాస్కర్, పార్టీ నాయకుడు బూశయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’ లీకేజీపై ప్రధాని స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

నర్సంపేట : నీట్ పేపర్ లీకేజీపై ప్రధాని మోదీ స్పందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో రాజేందర్ మాట్లాడారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ నీట్ చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి రాజీనామా చేయాలన్నారు. లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్, రవి, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు గట్టి కృష్ణ, నాయకులు బోగి సారంగపాణి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటస్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వేతన చట్టం తేవాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గూడూరు: దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం మీద ఆధారపడిన కూలీలకు సమగ్రవేతన చట్టం తీసుకురావాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మహబూబాబాద్ డివిజన్ నాయకుడు వీరెల్లి మల్లేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పెద్దకాసు కోరుమల్లు అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట గురువారం వారు మాట్లాడుతూ.. 14మందికి పైగా ఉన్న వ్యవసాయ కూలీలకు మెరుగైన వేతన చట్టం కావాలని ఎన్నో పోరాటాలు చేసిన గత పాలకులు పట్టించుకోలేదన్నారు. అనంతరం డీటీ కోమలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు అద్దూరి బ్రహ్మచారి, ఎర్రబెల్లి రాజు, వెంకటయ్య, వీరన్న, వెంకన్న, కిరణ్, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పేదల భూముల్లో ప్లాంటేషనా..?



ఫారెస్టు అధికారులను అడ్డుకుంటున్న రైతులు

గూడూరు: ప్రతీ సంవత్సరం ఇదే లొల్లా..? పేదల పోడు సాగు భూముల్లోనే ప్లాంటేషన్ పెడతారా.. గతేడాది నాటి ఎమ్మెల్యే శంకర్‌నాయక్ చెబితే వెనక్కి వెళ్లారు కదా.. మళ్లీ ఎందుకు వస్తున్నారంటూ హరిజన సామాజికవర్గానికి చెందిన పోడు సాగు రైతులు మందుల సారయ్య, లక్ష్మయ్య, శివ అటవీ శాఖ అధికారులను, సిబ్బందిని ప్రశ్నించారు. మండలంలోని బొల్లెపల్లి గ్రామ శివారులోని వాయిల్ బంధం సమీపంలోని మానుకోట ఫారెస్టు రేంజ్ పరిధిలో పోడు భూములను గురువారం ఎఫ్‌ఆర్వో జ్యోత్స్నదేవి సిబ్బందితో వచ్చి పరిశీలిస్తున్నారు. విషయం తెల్సుకున్న బొల్లెపల్లి శివారు ఎస్సీ కాలనీకి చెందిన హరిజన రైతులు అధికారులతో గొడవకు దిగారు. అందుకు ఎఫ్‌ఆర్వో మీ వద్ద ఏమైనా హక్కు పత్రాలు ఉంటే చూపండి, చూసి వెళ్లి పోతా, కానీ మావే అంటే వదిలేది లేదని స్పష్టం చేశారు. మాకు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఉందన్నారు. దీంతో రైతు మందుల సారయ్య పత్రాలు ఉన్నాయనగా, ఎఫ్‌ఆర్వో వెనక్కి తగ్గి, పత్రాలతో రేపు ఆఫీసుకు వచ్చి చూపమని చెప్పారు. లేకుంటే భూమిని వదిలేదిలేదని చెప్పి సిబ్బందితో వెనుతిరిగారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఖిలావరంగల్ : బాల్య వివాహాలను అరికట్టాలని సాంఘీక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ సూచించారు. గురువారం మధ్యకోటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలని చెప్పారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, సురేష్ కుమార్, సుదర్శన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సభ

గూడూరు : మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జులై 3వ తేదీన (బుధవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వీరస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండల అభివృద్ధి అంశాలపై చర్చించడంతోపాటు పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించనున్నట్టు వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, మండలంలోని సంబంధిత ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

‘సుశీలమ్మ సేవలు ఆదర్శనీయం’

ఖిలా వరంగల్ : ఆరెల్లి సుశీలమ్మ ఇంటిపై పోలీసులు దాడి చేసినా ధైర్యంగా ఎదుర్కొని నిలబడేదని, సమాజానికి ఆమె చేసిన సేవలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు బండి కోటేశ్వర రావు, మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు చంద్రన్న, సారంపెల్లి వాసుదేవరెడ్డి, హనుమకొండ జిల్లా కార్యదర్శి చక్రపాణి, మండల వెంకన్న సూచించారు. ఈ మేరకు గురువారం ఖిలా వరంగల్ మధ్యకోటలో ఆరెల్లి సుశీలమ్మ సంతాప సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సీపీఐ ఎంఎల్ నేత బైరబోయిన ఐలయ్య, హైదరాబాద్ నగర కార్యదర్శి విజయ్‌తో కలిసి వారు సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుశీలమ్మ సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రాచర్ల బాలరాజు, మైదం పాణి, కృష్ణ, హరిబాబు, చిర్ర సూరి, గడ్డం సదానందం, సున్న అప్పారావు పాల్గొన్నారు.